# ఒకటీ ఒంటరి అంకె

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1978 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన నవల*

*(గత సంచిక తరువాయి)*

5

**దాదాపు మూడు నెలలు గడిచాయి.** ఎప్పుడు ప్రయాణమవుదామా అని ఆలోచిస్తోంది సునీత.

త్రిపురం రిజల్ట్స్ వచ్చాయి. యూనివర్సిటీలో సెకండ్ వచ్చింది. హైయ్యర్ ఫస్ట్‌క్లాసులో పాస్ అయింది బి.ఎ.

"వీళ్ళు లేకపోతే గోల్డ్ మెడల్ వచ్చేది" అన్నది త్రిపురం నవ్వుతూ.

"వీళ్ళవల్లే ఆ మాత్రమయినా సాధించగలిగాననుకోరాదు" అన్నది సునీత.

త్రిపురానికి ఇపుడా కవల పిల్లలు అంటే తగని ముద్దు. మూడోనెల రావటం వల్ల పిల్లలు కాస్త వళ్ళు చేసి అందంగా ఉన్నారు. ఓ రోజు బాబు అన్నం తినగానే కక్కుకున్నాడు.

"ఏదిపడితే అది తినద్దంటే వినడు వెధవ. ఉప్మా వీడికి పడదు. నిన్నరాత్రి భోజనం మానేసి ఉప్మా మింగాడు" అన్నది సునీత కోపంగా.

కక్కులతో పాటు విరేచనాలు కూడా మొదలయాయి. సాయంత్రం అయేసరికలా నమ్మలేనంత ఆశ్చర్యంగా సన్నగా తోటకూర కాడలా వేలాడిపోయాడు బాబు. డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళింది సునీత. కొన్ని మందులిచ్చి వాడమన్నాడు. మర్నాడు సాయంత్రం మళ్ళీ తీసుకు వచ్చి చూపించమన్నాడు.

ఆ మందులు వాడింది. ఏం తిన్నా కక్కుకుంటున్నాడు బాబు. నీళ్ళ విరేచనాలు. పూర్తిగా నీరసించిపోయాడు.

కవల పిల్లలిద్దరూ కూడా అదే స్థితిలో ఉనారు. పాలు పడితే వెంటనే కక్కుకుంటున్నారు. మధ్యాహ్నం డాక్టర్ దగ్గరికి వెళ్ళింది సునీత కంగారుగా ముగ్గురు పిల్లలతో.

ఆయన వేరే మందులు రాసిచ్చి, ధైర్యం చెప్పి పంపాడు. మర్నాడు ఉదయం తీసుకురమ్మని చెప్పాడు.

రాత్రంతా నిద్రలేదు సునీతకి. పిల్లలు ముగురూ తోటకూర కాడల్లా వేలాడిపోతున్నారు. కవలపిల్లలయితే మూలగనయినా మూలగటం లేదు. మగతగా పడుకున్నారు.

మర్నాడు ఉదయం డొక్కలెగరేయటం ప్రారంభించాడు బాబు. కళ్ళుతేలిపోతున్నాయి. గుడ్లు నిలబడటంలేదు. సునీత ఏడవసాగింది భయంగా. వర్ధనమ్మ డాక్టర్‌ని పిలుచుకు వచ్చింది. ఆయన ముగ్గురు పిల్లలనీ పరీక్షించి చూసి చెప్పాడు.

"వెంటనే నీలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్ళటం మంచిది. ఊళ్ళో పిల్లలకి చాలామందికి ఇలాంటి అంటురోగం ఉంది. 'గేస్ట్రో ఎంటైటిస్' అంటారు."

నీలోఫర్ చిన్నపిల్లల రోగాలకి ప్రసిద్ధి చెందిన ఆస్పత్రి.

వర్ధనమ్మ కాళ్ళలోంచి వణుకు పుట్టుకొచ్చింది. త్రిపుర ఇంట్లో లేదు. స్టవ్ మీద ఉడుకుతున్న అన్నం గిన్నె దించి కవల పిల్లలని భుజాన వేసుకుంది.

సునీతకి ఏడుపు ఆగటంలేదు. బాబుని భుజాన వేసుకుని, ప్లాస్టిక్ బేగ్‌లో కావల్సిన సామాను సర్దుకుని ఇల్లు తాళం వేసింది. తాళం చెవి ప్రక్కింటావిడకి ఇచ్చి, త్రిపురం వస్తే ఇవ్వమని చెప్పింది. ఆటోలో బయలుదేరారు నీలోఫర్‌కి.

"వాళ్ళకేమయినా అయితే ఆయన నన్ను చంపేస్తారు." అంటోంది సునీత ఏడుస్తూ.

బాబుని చూస్తుంటేనే భయం వేస్తోంది వర్ధనమ్మకి. ఈ లోకంలో లేడు. డొక్క లెగరేయటం ఎక్కువైంది. చిన్నపిల్లలిద్దరూ మగతగా పడుకున్నారు. ఆటో కుదుపులకి కక్కుకుంటున్నారు వాళ్ళు.

"అమ్మయ్యో! ఎలా ఉండేవారు ఎలా అయారో?" అంటోంది సునీత ఏడుస్తూ.

ఆటో నీలోఫర్ ఆస్పత్రి కాంపౌండులో ఆగింది. ఆటోవాడికి అయిదురూపాయిలిచ్చి, చిల్లరకోసం ఆగకుండా కదిలారు లోపలికి. లోపల పెద్దక్యూ, చీటీరాయించుకోవాలి. క్యూలోని ప్రతీ వ్యక్తి చంకలో చిన్న పిల్లో, పిల్లాడో. ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. సునీత క్యూలో నిల్చుంది. అరగంట తర్వాత ఆ చీటీ తీసుకుని పక్కనే ఉన్న పెద్ద హాల్లోకి వెళ్ళారు. గుమ్మం దగ్గర వాచ్ మెన్ వర్ధనమ్మకి అడ్డం నిలబడి అన్నాడు.

"ఒక్కరే వెళ్ళాలి లోపలికి."

సునీత వాడిని బలంగా పక్కకి ఒక్క నెట్టు నెట్టింది. ఇద్దరూ లోపలికి వెళ్ళారు కళ్ళమ్మట నీళ్ళు కారుతుంటే, లోపలి దృశ్యం చూడగానే వాళ్ళ గుండె ఆగినట్టయింది ఒక్కసారిగా.

లోపల అనేక మంచాలు. వాటిమీద చిన్న చిన్న పిల్లలు. రోజుల పసికందులు కూడా ఉన్నారు. మంచం ప్రక్కన ఉన్న స్టాండ్‌లకి వేలాడుతున్న గ్లూకోస్ బాటిల్స్‌లోంచి, ముంజేతికి గుచ్చిన సూదులద్వారా నీళ్ళు ఆ పిల్లల ఒంట్లోకి ఎక్కుతున్నాయి. కొంతమందికి ఆక్సిజన్ పెడుతున్నారు.

ప్రతీ మంచం ప్రక్కనా ఉన్న స్టూలు మీద కూర్చున్న వాళ్ళ మొహంలో ఆదుర్దా, భయం, నైరాశ్యం కనబడుతున్నాయి.

డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళారు వాళ్ళని. ఆయన పరీక్ష చేసాడు. వర్ధనమ్మకీ సునీతకి ఉన్న ఆదుర్దాలో విసమెత్తుకూడా లేదు ఆ డాక్టరులో.

"ఇంత ఆలస్యం చేసారేం?" అన్నాడు.

వర్ధనమ్మ, సునీత వెంటనే భయంగా ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. ఓ కాగితం మీద ఏదో రాసిచ్చి, ఎదురుగావున్న ఓ గది చూపించాడు అక్కడికి తీసుకెళ్ళమన్నట్లుగా.

మందుల గది అది. ముగ్గురి నోట్లో మందుపోసారు. ఖాళీగా ఉన్న బెడ్‌ల మీద పడుకోబెట్టారు పిల్లలని.

డాక్టర్‌ని పిలిచింది నర్స్. ఆయనలోని నిదానం చూస్తే వళ్ళు మండింది సునీతకి. పిల్లలకి ప్రాణం మీదకి వస్తే ఆయన పట్టించుకోవటంలేదు. నర్స్ రెండుసార్లు పిలిచాక వచ్చాడు.

బాబుని పరీక్షించి మళ్ళీ అడిగాడు.

"ఇంతాలస్యం చేసారే?"

"ప్రమాదమా?" అడిగింది సునీత.

డాక్టర్ సమాధానం చెప్పలేదు.

నర్స్‌తో చెప్పి చిన్న కత్తి తెప్పించాడు. బాబు ఎడంకాలి వేలు కోయసాగాడు అక్కడక్కడా. ఆ నొప్పికి కూడా మూలగటం లేదు బాబు.

"అబ్బ! ఎందుకలా!" అన్నది సునీత చూడలేక డాక్టర్ ఆ మాటలు విననట్లే తన పని చేసుకుపోసాగాడు.

"నరం దొరకటం లేదు" చెప్పింది నర్స్.

"ముందరే తీసుకురావాల్సింది. ఆలస్యం చేసారు."

నరం దొరికేదాకా సునీత మనసు విలవిల్లాడిపోయింది. నరం దొరికాక గ్లూకోస్ బాటిల్ కున్న ట్యూబ్ చివరవున్న సూదిని నరంలోకి ఎక్కించి, ట్యూబ్ కున్న నాబ్ తిప్పాడు డాక్టర్. గ్లూకోస్ వాటర్ బాబు శరీరంలోకి ఎక్కసాగింది కాలు ఓ చెక్కకి కట్టారు బాండేజ్ తో.

"బాబు కాలు కదిపితే ఆ సూది ఓడిపోతుంది. ఒకరు దగ్గరుండి కాలు కదలకుండా చూస్తుండండి" చెప్పింది నర్స్. డాక్టర్ వెనక కవల పిల్లలున్న బెడ్ వైపు వెళుతూ.

వర్ధనమ్మ అన్నది సునీతతో.

"నీవు చూస్తుండు నే వెళతాను కవల పిల్లల దగ్గరికి."

డాక్టర్ ఇద్దరినీ పరీక్షించాడు స్టెతస్కోప్ తో. వెంటనే మళ్ళా తన సీట్ దగ్గరికి వెళ్ళిపోయాడు.

"బెడ్ ఖాళీ చేయండి" అన్నది నర్స్ డాక్టర్ అర్థం గ్రహించి.

"ఏమైంది?" అడిగింది వర్ధనమ్మ వణికే గొంతుతో.

"పోయారు"

వర్ధనమ్మ మనసు మొద్దుబారి పోయినట్లయింది. యంత్రంలా పిల్లల్నిద్దరినీ చెరో భుజాన వేసుకుంది.

"ఏమయింది?" అరిచింది సునీత ఏడుస్తూ.

వర్ధనమ్మ ఏడుస్తోంది.

"ఏమయింది?" అడిగింది సునీత మళ్ళీ.

"వాళ్ళకేం కాలేదు. పెద్ద డాక్టర్ దగ్గరికి తీసుకువెళుతున్నారు. మీరు బాబుని జాగ్రత్తగా చూచుకోండి కాలు కదపకుండా."

సునీత ప్రక్క బెడ్ మీద, తన మనవరాలు దగ్గర ఉన్న ఓ ముసలాయన ధైర్యం చెప్పాడు సునీతకి, వర్ధనమ్మకి రహస్యంగా సైగ చేసి. వర్ధనమ్మ బయటికి వెళ్ళిన కాసేపటికి వచ్చింది త్రిపురం. ఆదుర్దాగా అడిగింది తల్లిని. "ఎలా ఉన్నారు?"

వెంటనే మోకాళ్ళ మీద కూర్చుని కప్పిన తువ్వాలని తీసింది. ఇంకా పేర్లయినా పెట్టని కవలపిల్లలిద్దరూ - ఆ పసికందులిద్దరూ కళ్ళు మూసుకుని ఉన్నారు. వర్ధనమ్మ కళ్ళలో నీళ్ళూ, నిశ్చలనంగా ఉన్న ఆ పసిపాపలు, చుట్టుప్రక్కలవాళ్ళు బాధగా చూడటం.. త్రిపురానికి అర్థమైపోయింది వాళ్ళిక ఈ లోకంలో లేరని.

త్రిపురానికి గుండె పీకినట్లయింది.

"బాబు?" ఆదుర్దాగా అడిగింది.

"లోపల ఉన్నాడు. గ్లూకోస్ ఎక్కిస్తున్నారు."

"చూసొస్తాను - ఎక్కడ?"

ఆ గది వైపు చూపించి చెప్పింది వర్ధనమ్మ.

"సునీతకి ఇంకా వీళ్ళ సంగతి తెలియదు. అప్పుడే చెప్పకు."

త్రిపురం ఇన్ పేషెంట్స్ హోమ్‌లోకి వెళ్ళింది. ద్వారం నుంచే సునీతని, బాబుని చూచి ఆగిపోయింది. బాబుకి ఆక్సిజన్ పెట్టారు. ఏడుస్తోంది సునీత. ఆ పరిస్థితిలో అక్క దగ్గరకి వెళ్ళలేకపోయింది. గిరుక్కున వెనక్కి తిరిగి తల్లి దగ్గరకి వచ్చింది.

"కనపడ్డారా?" అడిగింది వర్ధనమ్మ.

తలూపి చెప్పింది త్రిపురం.

"నేను బావకి టెలిగ్రాం ఇచ్చివస్తాను."

త్రిపురం ఆటోలో జి.పి.ఓ.కి వెళ్ళి టెలిగ్రాం ఇచ్చి అదే ఆటోలో మళ్ళీ నీలోఫర్ ఆస్పత్రికి తిరిగి వచ్చింది.

"ఏమని ఇచ్చావ్?" అడిగింది వర్ధనమ్మ త్రిపురం కనపడగానే.

"వెంటనే బయలుదేరమని"

"ఎలా చేసాడో భగవంతుడు దీన్ని." అన్నది వర్ధనమ్మ. ఇంకా ఏడుస్తోంది.

త్రిపురానికి గుండెనిండా బాధగా ఉంది. కాని ఏడుపు రావటంలేదు. నిబ్బరంగా కూర్చుంది తల్లి పక్కన. అయిదు నిముషాల తర్వాత సునీత పిలుపు గుండె పిండేలా వినబడింది.

"అమ్మా"

ఇద్దరూ అటువైపు చూసారు.

సునీత బాబుని ఎత్తుకుని వస్తోంది ఏడుస్తూ. వచ్చి తల్లి పక్కన కూలబడింది.

"బాబూ!" సందిగ్ధంగా అడిగింది త్రిపురం.

"ఆయనకేం చెప్పను. ఆయనొచ్చి అడిగితే ఏం చెప్పను?" గుండెలు పగిలేలా రోదిస్తోంది సునీత.

"రామ్మా. రావే రా" అని వర్ధనమ్మ సునీతని తన ఒళ్ళోకి తీసుకుంది. ఆవిడకూడా ఏడుస్తూ.

త్రిపురానికి తనకు తెలియకుండానే కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

"వాళ్ళెలా ఉన్నారు?" అడిగింది సునీత.

ఎవరూ సమాధానం చెప్పలేదు.

"పెద్ద డాక్టర్ చూస్తున్నారా?" త్రిపురం అక్కయ్య భుజం మీద చెయ్యివేసి అన్నది అనునయంగా.

"ఊరుకో. ఎలాంటి బేడ్ న్యూస్ కయినా తట్టుకోవాలి నువ్వు. మనకంతా మంచే జరగదు."

తలెత్తి ఏడుపు ఆపి భయంగా చూస్తూ అడిగింది.

"కొంప తీసి వాళ్ళుకూడా.."

త్రిపురం తువ్వాలని తొలిగించింది.

"నిజంగా?"

సునీత రెండు చేతులూ పట్టు తప్పాయి. తల్లి ఒళ్ళోకి వాలిపోయింది నిశ్శబ్దంగా. హాస్పిటల్ స్టాఫ్ ఒకరు వచ్చి చెప్పారు అక్కడ ఏడవకూడదని, బయటకు వెళ్ళమని.

సునీత స్పృహతప్పిపడిపోయింది. మొహం మీద నీళ్ళు చల్లి స్పృహ తెప్పించారు సునీతకి. టేక్సీలో, చిన్నపిల్లల శవాలతో ఆ ముగ్గురూ ఇంటికి చేరుకున్నారు. సునీత అసలీ లోకంలో ఉన్నట్టుగా లేదు. ఏడ్చే ఓపిక లేదు. వర్ధనమ్మ కూడా తనని తను సంభాళించుకోలేకపోతోంది.

త్రిపురమే ధైర్యం తెచ్చుకుని కావలిసిన ఏర్పాట్లు చేయసాగింది. మర్నాడు సాయంత్రందాకా రాలేదు సునీత మొగుడు.

"ఇక ఆపడానికి వీల్లేదు. ఏర్పాట్లు చేయండి. చీకటి పడేలోగా" సలహా ఇచ్చారు చుట్టు ప్రక్కలవాళ్ళు.

సూర్యాస్తమయం లోపలే ముగ్గురి శవాలని మూడడుగుల గోతుల్లో కప్పేసారు. ఆ రాత్రి నిద్రపట్టడానికి సునీతకి కాంపోజ్ టేబ్లెట్స్ రెండు ఇచ్చింది త్రిపురం.

మర్నాడు మధ్యాహ్నం వచ్చారు త్రిపురం బావ. క్లుప్తంగా జరిగింది చెప్పింది త్రిపురం. నిద్రమాత్ర మరొకటి వేసుకుని నిద్రపోతోంది సునీత ఆ సమయంలో.

"నన్ను కాసేపు ఒంటరిగా వదులు " అన్నాడు జయరామ్ త్రిపురంతో.

త్రిపురం ఆ గదిలోంచి బయటకి వచ్చేసింది. వర్ధనమ్మ, త్రిపురం మౌనంగా కూర్చుండిపోయారు. గంట తర్వాత బయటకి వచ్చాడు జయరామ్.

ఎర్రబడి వాచిన కళ్ళతో ఉన్న ఆయన మొహం చూసి చాలాసేపు ఏడ్చాడని గ్రహించింది వర్ధనమ్మ. ఆయన బాత్ రూంలోకి వెళ్ళి మొహం కడుక్కుని బయటకు వెళ్ళిపోయాడు చెప్పులు తొడుక్కుని. చీకటిపడ్డ చాలాసేపటికి వచ్చాడు.

"లేచిందా?" అడిగాడు అత్తగారిని.

తల అడ్డంగా ఊపింది ఆవిడ.

"రేపు ఉదయం బండికి వెళ్ళిపోతాం."

"పోనీ ఇంకోవారం ఉండి, మనసు స్థిమిత పడ్డాక వెళ్ళవచ్చుగా."

"ఇంక ఒకటే స్థిమ్మితం."

మర్నాడు ఉదయం వెళ్ళిపోయారు ఇద్దరూ.

✷✷✷

*(ఇంకావుంది)*

ఈ నవల క్రిందటి భాగం ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library